కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించాలి

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

- యోగి రాకతో జనసంద్రమైన షాపూర్‌నగర్ రహదారులు
- తెలంగాణలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కూన శ్రీశైలంగౌడ్ తీవ్ర విమర్శలు


మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్


షాపూర్‌నగర్‌లో జరిగిన యూపీ సీఎం యోగి ప్రచార సభకు భారీగా హాజరైన జనం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌కు హిందూ సింహం, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విచ్చేస్తే స్థానిక ఎమ్మెల్యే గుంటనక్కలా దాక్కున్నాడని బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ ధ్వజమెత్తారు. షాపూర్‌నగర్‌లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదివారం కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. యోగిజీ రోడ్‌షోకు షాపూర్‌నగర్ రహదారులు జన సందోహంతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ... దేశం కోసం.. హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడే కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారు. తెలంగాణలో బీజేపీ అభ్యర్థులను గెలిపించి అవినీతిమయ బీఆర్ఎస్ పాలనకు అంతం పలకాలన్నారు.

యోగి రాకతో ఈనేల పులకరించింది...

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... హిందూ ధర్మ పరిరక్షకుడు యోగి ఆదిత్యానాథ్ కుత్బుల్లాపూర్ గడ్డమీద అడుగుపెట్టగానే ఈ నేల పులకరించిందన్నారు. అనంతరం ఆయన స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇక్కడున్న ఒక బట్టెబాజ్, బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్ అండ చూసుకుని ప్రధాని మోదీ మీద విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ బీఆర్ఎస్ అభ్యర్థికి ప్రధాని మోదీపై మాట్లాడే స్థాయి ఉందా అని ప్రశ్నించారు.

◆ వివేకానంద్ తొమ్మిదేళ్లలో ఏమి చేశావో చర్చకు సిద్ధమా.?

బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్‌కు ఒక్కటే సవాల్ విసురుతున్నా.. నీ కేటీఆర్, కేసీఆర్ అండ చూసుకుని బాగా ఎగురుతున్నావు... ప్రధాని మోదీపై మాట్లాడుతున్నావు... నీకు నిజంగానే కేసీఆర్, కేటీఆర్ అండదండలు ఉంటే.. కుత్బుల్లాపూర్‌కు ప్రత్యేకంగా ఎన్ని నిధులు తెచ్చావో చెప్పాలన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు దమ్ముంటే గాజులరామారం చిత్తారమ్మ గుడికి దగ్గరికి రా.. నేను వస్తా.. తొమ్మిదేండ్లు నువ్వేమి చేశావో చర్చకు సిద్ధామా? అని సవాల్ విసిరారు.

◆ బీజేపీ ఓట్లు చీల్చేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌వి దొంగ నాటకాలు...

బీజేపీ ఓట్లు చీల్చేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొంగ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లేనని ఆరోపించారు. బీజేపీకి ఓటేస్తే దేశ రక్షణకు, అభివృద్ధికి వేసినట్లేనని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద, కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి కుమ్మక్కై డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

◆ బీఆర్ఎస్ అభ్యర్థి నాపై దాడి చేసినా.. కాంగ్రెస్ అభ్యర్థి ఖండించలేదు...

ఎన్టీవీ డిబేట్‌లో కేపీ వివేకానంద్ తన మీద దాడి చేసి పీక పిసికినా కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డి కనీసం ఖండించలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోతే అమెరికా వెళ్లి ఎంజాయ్ చేస్తాడని... కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే ఫామ్‌హౌస్‌కి వెళ్లి రెస్ట్ తీసుకుంటాడని విమర్శించారు. తాను పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజల వెన్నంటే ఉన్నానన్నారు. 25 సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్ ప్రజలే నా కుటుంబ సభ్యులుగా అనుకొని ప్రజాసేవ చేస్తున్నానని పేర్కొన్నారు.

◆ రౌడీ ఎమ్మెల్యే కావాలా.. ప్రజాసేవ చేసే నేను కావాలా?

రెండుసార్లు ఓడిపోయినా... ఎమ్మెల్యే తన గొంతు పట్టి దాడి చేసినా భరించానంటే అది కుత్బుల్లాపూర్ ప్రజల కోసమేనని అన్నారు. మీకు రౌడీ ఎమ్మెల్యే కావాలో.. ప్రజల కోసం పనిచేసే శ్రీశైలంగౌడ్ కావాలో ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కుత్బుల్లాపూర్‌ని రాష్ట్రంలోనే ఒక గొప్ప నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనని అన్నారు. ఈ హామీ హిందూ సింహం యోగి ఆదిత్యానాథ్ సాక్షిగా మాట ఇస్తున్నానని అన్నారు.


కొంపల్లి దళితవాడలో అల్పాహారం తీసుకుంటున్న కూన శ్రీశైలంగౌడ్


కొంపల్లి ఎన్‌సీఎల్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్


కాపు సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కాపు సేవా సమితి, సంక్షేమ సంఘాల

వనభోజన వేడుక

చింతల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం చింతల్ డివిజన్ హెచ్‌ఎంటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సత్తి ఏసుబాబు ఆధ్వర్యంలో అపెక్స్ కమిటీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్, సుప్రీంకోర్టు అడ్వకేట్, దిలీప్ సుంకరి, కాపు సంఘం సౌత్ ఇండియా అధ్యక్షులు దాసరి రాము, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, జబర్దస్త్ కామెడీ షో ఆర్టిస్టులు అశోక్, బాబీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కాపు కులస్తుల సంఘ భవనం కోసం స్థలం కేటాయించానన్నారు. భవిష్యత్‌లోనూ వారికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాపు కులస్తులను కోరారు. జనసేన పార్టీ మద్దతు తెలుపుతున్న తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ కమిటీ సభ్యులు సత్తి ఏసుబాబు, పి.దుర్గారావు, గౌరిశెట్టి శివఈశ్వర్‌రావు, కుప్పాల మధు, కోనేటి సత్యనారాయణ, కొట్టె రమణ, ఎల్‌వీసీ సుబ్రహ్మణ్యం, ఎస్.నవీన్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో...



కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో జరిగిన కాపు సంక్షేమ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ... కాపు సంక్షేమం కోసం, అభ్యుదయం కోసం కృషి చేసిన ఒకే ఒక్క నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. కాపు సంక్షేమ భవనం కోసం హైటెక్ సిటీకి సమీపంలో 7 ఎకరాల భూమి కేటాయించిన మనసున్న నాయకుడు కేసీఆర్‌యే అని కొనియాడారు. కాపులు అందరూ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మన, తమ బేధం లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. కాపు సంక్షేమ భవనం కోసం దేవేందర్‌నగర్‌లో 2వేల గజాల స్థలం కేటాయించామని తెలిపారు. ఎన్నికల అనంతరం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకుందామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సంఘం సభ్యులు పరస పరమేశ్వరరావు, భగవాన్, ఎంఎస్ వాసు, హెచ్‌ఎంటీ సుబ్బారావు, దేగ లక్ష్మణమూర్తి, గొలిశెట్టి కృష్ణమూర్తి, పుప్పాల మల్లికార్జున్, మూర్తి, ఆంజనేయులు, దుర్గ, కార్పొరేటర్‌లు రావుల శేషగిరి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించి మరోసారి గెలిపించండి

కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్


నిజాంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుల, మత, ప్రాంతాలకు అతీతంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సంక్షేమ పథకాలను అందజేశామని, మరోసారి ప్రజలు తనను ఆశీర్వదించాలని స్థానిక ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. నియోజకర్గంలోని పలు ప్రాంతాలు, కాలనీలు, బస్తీల్లో వివేకానంద్ విస్తృతంగా పర్యటించారు.

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బెవర్లీ స్ప్రింగ్ వ్యాలీ, యన్టిల్లా, హరితవనం, క్రాంతినగర్‌ల్లో వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు కొలన్ మీనా సునీల్‌రెడ్డి, విజయలక్ష్మి సుబ్బారావు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్ 2వ డివిజన్‌లోని రాఘవేంద్ర బృందావనం సొసైటీ, ఎస్వీఎల్ఎస్ హైట్స్, కెఎస్ఆర్ హోమ్స్ పార్క్ వ్యూ, శివశక్తి సదన్ రెసిడెన్సీ, రాఘవేంద్ర రెసిడెన్సీ, సాయి కృష్ణ బృందావనం, ఎస్‌విఎల్ఎస్ ప్రైడ్, ధరణి ప్రెస్టిన్ రెసిడెన్సీ, సీనియర్ సిటిజన్స్ సొసైటీ సభ్యులు వివేకానంద్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తు సంపూర్ణ మద్దతు తెలిపారు.

◆ చింతల్ డివిజన్ హెచ్‌ఎంటీ కాలనీలో కుత్బుల్లాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వనభోజన కార్యక్రమానికి వివేకానంద్ హాజరయ్యారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌గౌడ సంక్షేమ సంఘం సలహాదారులు నల్లా లింగంగౌడ్, కూన శ్రీరాములుగౌడ్, మద్దెల జయరాజుగౌడ్, కూన సుధాకర్‌గౌడ్, అధ్యక్షులు కూన రాజకుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు మద్దెల గణేష్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, వ్యాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సందీప్‌గౌడ్, కూన శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ వీఎస్ఆర్ సెలెస్టియల్ టవర్స్ వద్ద నిర్వహించిన సమావేశానికి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు విజయ రాంరెడ్డి, సీనియర్ నాయకులు రషీద్ బేగ్, కమలాకర్, శ్రీనివాస్ యాదవ్, గోవర్ధన్, బాబీ, చిన్నా చౌదరి, వీఎస్ఆర్ సెలెస్టియల్ టవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్వీశివకుమార్, ఉపాధ్యక్షులు అరుణ, కోశాధికారి గోన సతీష్, కార్యదర్శి పి. స్వప్న, సంయుక్త కార్యదర్శి కేవీ రంగారెడ్డి సభ్యులు టి. రాధాకిషన్, విజయలక్ష్మి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్, బీరప్ప నగర్, జగద్గిరినగర్, మైసమ్మ నగర్, షిర్డీ హిల్స్, రాజీవ్ గృహకల్ప, శ్రీనివాస్‌నగర్ ల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్న వివేకానంద్‌ను తెలంగాణ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, హేమసుందర్ పాల్గొన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్ చౌహన్ ఆధ్వర్యంలో 100 మంది మహిళలు, యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి శంకర్‌నాయక్ కండువాలు కప్పి ఆహ్వానించారు.


జగద్గిరిగుట్టలో జరిగిన రోడ్‌షోలో ప్రజలతో కరచాలనం చేస్తున్న వివేకానంద్


గాజులరామారంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రావుల శేషగిరి, చిత్రంలోఎమ్మెల్యే వివేకానంద్


గౌడ సంఘం వనభోజన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


కౌన్సిలర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులు


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


వివేకానంద్‌కు ఏకగ్రీవ తీర్మానాన్ని అందజేస్తున్న అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం సభ్యులు


కాపు సంక్షేమ సంఘం వన భోజనంలో ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, ఎమ్మెల్యే వివేకానంద్

ఓటర్లకు ఎర..

పెరిగిన ప్రలోభాల జోరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడు రోజులు మాత్రమే ఉంది. ఈ కొద్ది సమయం అన్ని పార్టీల అభ్యర్థులకు ఎంతో కీలకం. ఎలాగైనా ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలని బహుముఖ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రత్యర్థుల కంటే ముందే ఆకట్టుకోవాలనే లక్ష్యంతో జిల్లాలో అన్ని పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. బస్తీలు, వార్డులు, డివిజన్లు, కాలనీలు, అపార్టుమెంట్లు, గ్రామాలు, సామాజిక వర్గాల వారీగా తాయిలాలు ప్రకటిస్తూ వారికి కావాల్సింది చేస్తూ.. ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పోటాపోటీగా సభలు, రోడ్డు షోలు, పాదయాత్రలకు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి జనాలను సమీకరిస్తున్నారు. సాయంత్రం అయ్యే సరికి ఎవరెవరికి ఏమేమి అవసరమో సమకూరుస్తున్నారు. బిర్యానీ పొట్లాలు, మందు సీసాలు విరివిగా లభిస్తున్నాయి. తాయిలాలు సమకూరుస్తూ విజయం తమదేనంటూ అభ్యర్థులు ఎవరికివారు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

నగర శివారు హోటళ్లు, రిసార్టుల్లో ఆత్మీయ సమ్మేళనాలు, జోరుగా చేరికలు

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 126 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు కాస్తో కూస్తో ప్రభావం చూపించే చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు బరిలో ఉన్నారు. దీంతో పోటీ తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో ఎవరికి వారు గెలవాలనే పట్టుదలతో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నారు. నగర శివారుల్లోని హోటళ్లు, రిసార్టులు, కమ్యూనిటీ హాళ్లలో సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మీకేం కావాలో చెప్పండి.. మీ వర్గం ఓట్లన్నీ మాకే వేయండి.. అంటూ తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. హాజరైన వారందరికీ బిర్యానీ వంటి రుచికర భోజనాలు వడ్డిస్తున్నారు. అలాగే.. ఇతర పార్టీ నుంచి వారి పార్టీలోకి వచ్చి కండువా వేసుకునే వారి లెక్కలు వేరేగా ఉన్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు ముందుగా వారితో చర్చలు కండువాలు వేయించి, రూ.వేలు ముట్టచెబుతున్నట్లుగా సమాచారం. పార్టీల అభ్యర్థులు బలంగా ఉన్న చోట ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదనేది వినిపిస్తున్న మాట.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి


అపురూప కాలనీలో జరిగిన రోడ్‌షోకు హాజరైన జనం


అపురూప కాలనీలో కొలన్ హన్మంతరెడ్డిని గజమాలతో సత్కరించిన కార్యకర్తలు, అభిమానులు


సాయిబాబానగర్‌లో జరిగిన రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: తెలంగాణాలో గడీల పాలను అంతం చేసి, బంగారు తెలంగాణాను సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉందని.. ప్రజలు వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో కాంగ్రెస్ పార్టీ రోడ్‌షోను ప్రారంభించిన హన్మంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాసకాలనీ, మదురానగర్, ప్రశాంతి హిల్స్, సైదప్పనగర్ బస్తీ, రాజీవ్‌గృహకల్ప, రాజధాని స్కూల్, బండారి లేఅవుట్, రెడ్డి ఎవెన్యూ, పుష్పక్ రోడ్డు, ఈశ్వర్ విల్లాస్, కేటీఆర్ కాలనీ, బాలాజీనగర్, తిరుమలనగర్, వెంకట్రాయ నగర్, సిరి ఎన్‌క్లేవ్, నారాయణరెడ్డి కాలనీలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

◆ అనంతరం ఆయన మాట్లాడుతూ సుస్థిర పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ బీటలు వారిందని, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలండ్యామ్, నిజాంసాగర్,శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు నేటికి చెక్కు చెదరలేదన్నారు. సీఎం కేసీఆర్ కమిషన్లకు కక్కుర్తిపడి ప్రజాధనాన్ని వృధా చేశారని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో అధికార పార్టీకి గుణపాటం చెప్పేలా ప్రజా తీర్పు ఉండబోతుందన్నారు. కాంగ్రెస్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

◆ సుభాష్‌నగర్ డివిజన్ పరిధి సూరారం రాజీవ్‌గృహకల్పలోని శ్రీవిఘ్నేశ్వరస్వామికి ఎన్నికల ప్రచారంలో భాగంగా హన్మంతరెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం ఓం జెండా మీదుగా సాయిబాబానగర్ నుంచి హమీద్‌బస్తీ, అపురూపా కాలనీల్లో రోడ్‌షో నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.


ప్రగతినగర్ ఎన్టీఆర్ నగర్‌లో కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు


నిజాంపేట్‌లో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి


నిజాంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జగన్, దళిత సంక్షేమ సంఘం సభ్యులు

జగద్గిరిగుట్ట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీన వర్గాల హక్కులను కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేశారని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు జనాపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్ర యాకయ్య, కన్వీనర్ పరుశురామ్, కోశాధికారి బాలకృష్ణ, రాజీవ్ గృహకల్ప సొసైటీ మాజీ ప్రధాన కార్యదర్శి ధర్మారపు అంజయ్య, మీడియా సెల్ కార్యదర్శి చింతకుంట్ల అనిల్, దళిత సంక్షేమ సంఘం సభ్యులు పీవీరావు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం


బ్రహ్మ కమలానికి పూజలు చేస్తున్న సురేష్‌గౌడ్ కుటుంబ సభ్యులు

రంగారెడ్డినగర్: షాపూర్‌నగర్‌కు చెందిన సురేష్‌గౌడ్ ఇంట్లో ఆదివారం బ్రహ్మకమలం వికసించింది. మూడు సంవత్సరాల క్రితం నాటిన బ్రహ్మకమలం మొక్కకు పువ్వు వికసించడంతో ఆ కుటుంబం సభ్యుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. కార్తీక మాసం కావడంతో బ్రహ్మకమలం మొక్కకు విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మకమలాన్ని చూడటానికి చుట్టు పక్కల ఇళ్ల వాసులు క్యూకట్టారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

సుభాష్‌నగర్: కార్తీక మాసం సందర్భంగా సూరారం శివాలయనగర్‌లోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉమామహేశ్వరుడు నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


నందివాహనంపై దర్శనమిస్తున్న శివాలయనగర్‌లోని ఉమామహేశ్వరుడు